క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల పంపిణీ

బోట్‌క్లబ్: స్థానిక మానవీయ వృద్ధాశ్రమానికి రెయిన్‌బో క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కిరణా సామగ్రి అందించారు. క్లబ్ సభ్యులు కర్రి నాని సౌజన్యంతో వాటిని అందజేసినట్టు క్లబ్ జోన్ చైర్మన్ లక్ష్మీ నాగేంద్ర తెలిపారు. క్లబ్ సభ్యులు బాలాత్రిపుర సుందరి, దుర్గా ప్రసాద్, వంగా శివరామకృష్ణ, సత్తిబాబు, ప్రకాష్ పాల్గొన్నారు.

హనుమ ప్రార్థనతో అభీష్ట సిద్ధి



విజయ సింహాచార్‌ను సత్కరిస్తున్న మధ్వసభ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తే సకల అభీష్టాలు నెరవేరుతాయని రాజమండ్రి ఉత్తరాధి మఠాధికారి, సుధా పండితులు విజయ సింహాచార్ అన్నారు. స్థానిక రామారావుపేట మధ్వసభలో హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించిన అధ్యాత్మిక ప్రవచనాలు గురువారంతో ముగిశాయి. శ్రీరామచంద్రుని పట్ల ఆంజనేయ స్వామి ఉన్న అపారభక్తిని ప్రస్తావిస్తూ ఏనాడు ఆయన స్మరణ లేనిదే ఉండేవారు కాదన్నారు. ఆయన మూడో అవతారమైన మధ్వా చార్యుల విశేషాలను కూడా వివరిస్తూ జ్ఞాన, భక్తి, వైరాగ్యాలలో వీరికి మించిన వారు లేరన్నారు. మధ్వ సభ కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్ర స్వామి, కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు సంయుక్త ఆధ్వర్యంలో విజయ సింహాచార్‌ను ఘనంగా సత్కరించారు.

ఘనంగా ధనమ్మ తీర్థం



కొంగోడు గ్రామ దేవత ధనమహాలక్ష్మి అమ్మవారు

కరప: కొంగోడు గ్రామ దేవత ధన మహాలక్ష్మి (ధనమ్మ) తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. కొంగోడు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ధనమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు తీర్థం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్‌ఐ టి.రామకృష్ణ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జాతరలో భాగంగా జరిగిన ఘర్షణలో మాతా ఆనందరాజు అనే వ్యక్తిని సత్యంశెట్టి సూరిబాబు కర్రతో గాయపరిచాడు. బాధితుడి స్నేహితుడు పచ్చిపాల భీమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కూరాడలో ఎన్నికల ప్రచారం

కరప: మండలం కూరాడలో గురువారం జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని ప్రచారం చేశారు. నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, జేఎస్పీ నాయకుడు పంతం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

పెద్దాపురం: ప్రస్తుత వాతావరణంలో వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక చేపల వీధిలో వైద్య బృందం ఎస్‌ఈఓ జీవన్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దావీదురాజు మాట్లాడుతూ ఇళ్లలో ఫ్రిజ్, పూల కుండీల్లో దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉందన్నారు. దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సారా దాడుల్లో ఆరుగురి అరెస్టు

- 40 లీటర్ల సారా స్వాధీనం
- 3600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



సారా టిన్నులను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ, సిబ్బంది

పెద్దాపురం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి సారా విక్రయాలకు పాల్పడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఏవీవీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలోని కట్టమూరు శివారులో దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా సుమారు 3600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఒక మోటారు సైకిల్, హాఫ్ హెచ్‌పీ మోటారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మరోసారి సేవచేసే అవకాశం ఇవ్వండి

- 18 నెలల్లో సొంతింటి కల సాకారం చేస్తా
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ఎన్నికల ప్రచారంలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి

కాకినాడ: రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించి ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన 37వ డివిజన్ పరిధిలోని వార్ఫు రోడ్డు వినాయకుని ఆలయం వద్ద నుంచి ఎన్నికల ప్రచారం చేశారు. ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ సిటీ ఎమ్మెల్యేగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నగరాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించారన్నారు. ముఖ్యంగా కాకినాడ సిటీలో 30 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, మూడోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే 18 నెలల వ్యవధిలో స్థలాలు పొందిన ప్రతి ఒక్కరికీ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసి సొంతింటికల సాకారం చేస్తానని హామీ ఇచ్చారు.



భర్త ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న సతీమణి మహాలక్ష్మి





తండ్రి ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కుమార్తెలు డాక్టర్ ప్రణీత, డాక్టర్ అంజని తదితరులు

మహాలక్ష్మి ప్రచారం

సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి భార్య మహాలక్ష్మి గురువారం 8వ డివిజన్ డైరీఫారం బాలవెంకట్‌నగర్, సెవెన్ హిల్స్ రోడ్ ప్రాంతాల్లో భర్తకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. డైరీ ఫారం పరిధిలో ఆమె ఇంటింటికీ వెళ్లి భర్తను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు చిట్నీడి సత్యవతి, చిట్నీడి మూర్తి, నల్లబెల్లి సుజాత, రాయుడు వాసు, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

ద్వారంపూడి కుమార్తెల ప్రచారం

స్థానిక 18వ డివిజన్ తూరంగిపేటలో ఎమ్మెల్యే ద్వారంపూడి కుమార్తె డాక్టర్ అంజని శుక్రవారం ఇంటింట ఎన్నికల ప్రచారం చేశారు. తండ్రి చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఇతర నాయకులు ఆమె వెంట ఉన్నారు. అలాగే మరో కుమార్తె డాక్టర్ ప్రణీత 28వ డివిజన్‌లో ప్రచారం చేస్తూ 2019కి ముందు, ఆ తరువాత ద్వారంపూడి హయాంలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేస్తూ నగర ప్రగతిని వివరించారు. ఆ వ్యత్యాసాన్ని గుర్తించి తండ్రి ద్వారంపూడికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మూడోసారి గెలిపించడం ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించే అవకాశాన్ని కల్పించాలని కోరారు.

చివరి రోజు 12 నామినేషన్లు

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ కోసం నామినేషన్ల స్వీకరణ చివరి రోజు గురువారం 12 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో వైఎస్సార్ సీపీ తరఫున కురసాల కన్నబాబు, వెలుగుబంటి వీరభద్రరావు (స్వతంత్ర) ఒక సెట్, అన్యం విశ్వేశ్వరరావు(స్వతంత్ర) ఒక సెట్, కొరమాటి మహర్షి (తెలుగు నవగర్జన) ఒక సెట్, దడాల బాబ్జీ (జై భీమ్ భారత్‌పార్టీ), తుమ్మలపల్లి అనంత వెంకటశివప్రసాద్(కాంగ్రెస్ పార్టీ) ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున మేశం వీరాస్వామి, జాతీయ జనసేన పార్టీ తరఫున పట్నాల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ తరఫున పిల్లి సృజన ఒక సెట్, కాంగ్రెస్ పార్టీ తరఫున పిల్లి సత్యలక్ష్మి రెండు సెట్లు, తెలుగు జనతా పార్టీ తరఫున పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థిగా పితాని అన్నవరం రెండు సెట్లు నామినేషన్లను ఆర్వో కిశోర్‌కు సమర్పించారు.

సిటీ నియోజకవర్గంలోనూ..

కాకినాడ: సిటీ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి 22 నామినేషన్లు దాఖలయ్యాయి. వీరి తరఫున 37 సెట్లు దాఖలైనట్టు ఆర్వో జె.వెంకటరావు తెలిపారు. ఆఖరి రోజైన గురువారం 12 నామినేషన్లు దాఖలైనట్టు ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీతోనే మెరుగైన పాలన

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఇంద్రపాలెంలో హోరెత్తిన ప్రచారం



ఇంద్రపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాకినాడ రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

కాకినాడ: మండలంలోని ఇంద్రపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు ఎన్నికల ప్రచారం హోరెత్తింది. గ్రామంలో గురువారం సాయంత్రం ప్రచారం వాహనంపైన, ఇంటింటికి పర్యటించి ఓటర్లను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను తదితరుల ఆధ్వర్యంలో కన్నబాబుకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, హారతులు పట్టారు. జై జగన్... జై కన్నబాబు అంటూ నినదించారు. కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లగా సంక్షేమ పాలనను అందించారని, ఆయనకు మీ ఆశీర్వచనాలు అందివ్వాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, ప్రజలకు మెరుగైన సేవలు అందాలన్నా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉన్న తనతోపాటు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, కూటమి పార్టీల హామీలను నమ్మవద్దన్నారు. ప్రచారంలో మాకినీడి శేషుకుమారి, మాజీ మేయర్ సరోజ, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు ప్రాముఖ్యతను గుర్తించండి

- ఓటర్లకు ఆర్వో వెంకటరావు పిలుపు
- రాజాట్యాంక్‌లో సెల్ఫీ పాయింట్



సెల్ఫీ పాయింట్ వద్ద ఆర్వో వెంకటరావు, అధికారులు

కాకినాడ: ప్రతి ఒక్కరూ ఓటు ప్రాధాన్యాన్ని గుర్తించాలని సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. స్థానిక రాజాట్యాంక్ పార్కులో ఓటు విలువను తెలియజెప్పడం, ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించడం లక్ష్యంగా 'సెల్ఫీ పాయింట్' ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్)లో భాగంగా ఇది ఏర్పాటైంది. ఈ సందర్భంగా అహ్లాదం కోసం, వాకింగ్ కోసం వచ్చిన ఓటర్లకు ఆర్వో వెంకటరావు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఓటు వేద్దామనే నినాదంతో ఏర్పాటైన ఈ సెల్ఫీపాయింట్ వద్దకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నదే ఎన్నికల కమిషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రధానంగా యువ ఓటర్లు చైతన్యవంతులై ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్‌ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్‌ఈ పి.వెంకటరావు, ఈఈ సత్యకుమారి, పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చలమలశెట్టి నామినేషన్‌కు భారీగా శ్రేణులు



ఎంపీ అభ్యర్థి సునీల్ నామినేషన్‌కు గంగనాపల్లి నుంచి ర్యాలీగా వెళ్తున్న గీసాల శ్రీనివాసరావు అనుచరులు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ నామినేషన్‌కు కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచి భారీగా అభిమానులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని కాకినాడ రూరల్ మండలంతో పాటు కరప మండలం, అర్బన్‌లోని 8 డివిజన్ల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామాలలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు ర్యాలీగా వెళ్లారు. గంగనాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు బైక్ ర్యాలీగా వెళ్లగా తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ ఓపెన్ టాప్ కారుపైన అనుచరులు బైక్ ర్యాలీగాను భారీగా అచ్చంపేట జంక్షన్‌కు తరలి వెళ్లారు. వలసపాకల నుంచి జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కొవ్వాడ నుంచి సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ తదితరులు అనుచరులతో వెళ్లారు.

కరప నుంచి..

కరప: వైఎస్సార్ సీపీ కాకినాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ నామినేషన్‌లో పాల్గొనేందుకు కరప మండలంలోని 23 గ్రామాల నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, గ్రామకమిటీ నాయకులు, అనుబంధ సంస్థల ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మోటార్‌సైకిళ్లపై ర్యాలీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పిలుపు మేరకు జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, జేఎస్‌సీ కన్వీనర్ కాదా వెంకటేశ్వరరావు, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి జై జగన్ నినాదాలతో కాకినాడకు వెళ్లారు.



కరప నుంచి ఎంపీ అభ్యర్థి సునీల్ నామినేషన్‌కు మోటార్ సైకిళ్లపై వెళుతున్న శ్రేణులు

'హోం ఓటింగ్'కు 43 మంది గుర్తింపు

- వారందరితో విధిగా ఓటు వేయించాలి
- ఆర్వో వెంకటరావు ఆదేశం



హోమ్ ఓటింగ్‌పై సమీక్షిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హోం ఓటింగ్ ప్రక్రియకు 43 మందిని అర్హులుగా గుర్తించామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఈ అంశంపై గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్టార్ అధికారులు, సంబంధిత బీఎల్‌వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేయలేని 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగుల కోసం హోం ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో 43 మందిని గుర్తించామని, వీరందరి ఇంటి వద్దే ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆ మేరకు సంబంధిత సెక్టార్ అధికారులు, బీఎల్‌వోలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వీరితో ఓటు వేయించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏవో శిరీష్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలో టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొప్పిశెట్టి అప్పలరాజు, శివకుమార్, పవన్‌కుమార్, అంజనేయులు, లక్కోజు రాజు, వల్లి దుర్గాప్రసాద్, లుకలపు ప్రసాద్, బర్రే దుర్గాశ్రీను, శ్రీరామరాజు, గొల్లపల్లి శివ, వల్లు సాయికిరణ్, పెదపూడి శివసత్యం , సురేష్, శివ తదితరులు చేరారు. ఈ సందర్భంగా కన్నబాబు వారికి పార్టీ కండువాలను వేసి స్వాగతం పలికారు. పార్టీ విజయానికి కష్టించి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాకినీడి శేషుకుమారి, జంగా సత్తిబాబు, పాలిక నరసింహమూర్తి, తర్లంపూడి నాని, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణపై అవగాహన

కొత్తపల్లి: వేసవిలో రైతులు పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి పశువైద్యాధికారి శ్రీమన్నారాయణ సూచించారు. స్థానిక పశువైద్య కేంద్రం వద్ద గురువారం పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పశువులకు ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ప్రధానంగా గేదెలు, సంకరజాతి పశువులు వేసవి తీవ్రతను తట్టుకోలేవన్నారు. దీంతో పాల ఉత్పత్తి తగ్గడం, ఎదుగుదల రాకపోవడం, ఎదకు వచ్చిన లక్షణాలు కనిపించకపోవడం తదితర సమస్యలు ఏర్పడతాయన్నారు. సంకరజాతి విదేశీ ఆవులు ఎండ తీవ్రతకు గురైతే పాలదిగుబడి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. పశువుల మేతకు ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత అనుకూల సమయమన్నారు. పశువులకు ఎల్లవేళలా చల్లని నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

ప్రతి ఒక్కరం ఓటేద్దాం..

- స్వీప్ లక్ష్యం సాధిద్దాం
- ఎంసీసీ ఆధ్వర్యంలో మానవహారం



స్వీప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంసీసీ కన్వీనర్ ఉషారాణి

పెద్దాపురం: భారత ఎన్నికల సంఘం (స్వీప్) లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరం ఓటేద్దాం.. స్వీప్ లక్ష్యాన్ని సాధిద్దామని పెద్దాపురం ఎంసీసీ కన్వీనర్, ఎంపీడీఓ జి.ఉషారాణి ఆధ్వర్యంలో గురువారం ప్రజలతో కలిసి మండలలలోని జె.తిమ్మాపురంలో మానవహారం నిర్వహించారు. ఉషారాణి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో నూరు శాతం పోలింగ్ లక్ష్యంగా స్వీప్ పని చేస్తోందని, దీనికి ప్రతి ఓటరూ సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓ పీఆర్డీ సక్కా సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సుభాని, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో రూ.90 వేలు స్వాధీనం

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని అనుమానం ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం స్థానిక మఠంసెంటర్‌లో మోటారు సైకిల్‌పై వెళుతున్న మండిపూడి జగదీష్‌ను ఆపి తనిఖీ చేయగా అతని వద్ద రూ.90వేలు నగదు లభించింది. దానికి సంబంధించి ఎటువంటి రసీదులు, రికార్డు లేక పోవడంతో అధికారి వై.శివరామకృష్ణయ్య నగదు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఏఎస్సై రత్నం ఆధ్వర్యంలో నగదును లెక్కించి ఆర్వోకు అప్పగించారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తం

- ప్రశాంత వాతావరణం ఉండేలా చూడండి
- నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాజేష్ జోగ్‌పాల్



ఎన్నికల రికార్డులను పరిశీలిస్తున్న జోగ్‌పాల్

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియపై మరింత అప్రమత్తత అవసరమని నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు రాజేష్ జోగ్‌పాల్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఆఖరి రోజు గురువారం నియోజకవర్గ నామినేషన్ కేంద్రంలో ప్రక్రియను ఆయన ఆర్‌ఓ జేఎస్ రామారావుతో కలిసి పరిశీలించారు. జోగ్‌పాల్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను సజావుగా అమలు చేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రశాంత వాతవరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కోడ్‌పై ప్రజలకు మరింత అవగాహన పెంచాలన్నారు. అనంతరం నామినేషన్ కేంద్రం వద్ద జరుగుతున్న వెబ్ కాస్టింగ్, నామినేషన్ల ప్రక్రియ, తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. తొలుత నియోజకవర్గంలో ఎన్నికల ప్రక్రియ తీరుపై ఆర్‌ఓ జేఎస్ రామారావును అడిగి తెలుసుకున్నారు. ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పరిశీలకులు రాజేష్ జోగ్‌పాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ సుబ్రహ్మణ్యం, డీఎస్పీ లతాకుమారి, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, డీటీ భానుకుమార్, పద్మజ తదితరులున్నారు.

రేయిలో హాయి.. పగటిలో పాట్లు..



కరపలో ఉదయం 6.30 గంటలకు కనిపిస్తున్న మంచుపరదా



కరపలో సాయంత్రం 4 గంటలకు జన సంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్న మెయిన్‌రోడ్డు

- నడిరాత్రిలో మంచు పరదాలు
- తెల్లారితే ఉష్ణ తాపాలు
- విభిన్న వాతావరణంతో ప్రజలు అవస్థ

కరప: మండల పరిధి గ్రామాల్లో గురువారం నాటి ఎండకు ప్రజలు అల్లాడిపోయారు. 44 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వడంతో బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇప్పుడే ఎండతీవ్రత ఇలా ఉంటే మే నెలలో వచ్చే కర్తర్లు, రోహిణి కార్తెలో వడగాడ్పులు ఎలా ఉంటాయోనని గ్రామాల్లోని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కర్ఫ్యూ వాతావరణం నెలకొంటోంది. అన్ని పనులూ మానేసి ఇంటి పట్టున ఉన్నా శ్లాబ్ నుంచి వచ్చే వేడి తలకు పట్టేసి, అంతా అయోమయంగా ఉంటోందంటున్నారు. వ్యాపారస్తులు మధ్యాహ్నం 12 గంటలకే దుకాణాలు మూసేసి మళ్లీ సాయంత్రం తెరుస్తున్నారు.

ఉదయం మంచు పరదా

పగలంతా సూర్యభగవానుడు ప్రతాపం చూపిస్తుంటే అర్ధరాత్రి నుంచి మంచు పడి చల్లగా ఉంటుంది. మూడు రోజులుగా తెల్లవారుజాము నుంచి దట్టంగా మంచు కురవడంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సూర్యోదయానికి ముందు ఉదయం 7 గంటల వరకు మంచు పరదా కమ్మేయడంతో హమ్మయ్య ఈరోజు వేసవితాపం ఉండదులే అనుకుంటున్నామని, ఇంతలో సూర్యుడు ఉదయిస్తూనే ప్రతాపం చూపిస్తున్నాడు. ఉదయాన్నే మంచు, ఆ తర్వాత ఉష్ణతాపం.. విభిన్న వాతావరణ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రజలు అంటున్నారు.